# ప్రేమంటే...

-ఎం. గాంధీ



"మా పుట్టింటి వాళ్ళు కొనిచ్చిన వాచీ వుంది నాకు. కానీ తను కొనిచ్చిన వాచినే నేను పెట్టుకోవాలని రాత్రి మా ఆయన తీసుకొచ్చాడు" అంది నళిని తన చేతికున్న వాచీని ప్రణవికి గర్వంగా చూపిస్తూ.

"అలాగా" అన్నట్లు చూసి ఊరుకుంది ప్రణవి.

నళిని, ప్రణవి ఇరుగుపొరుగు ఇళ్ళల్లో వుంటారు. తమ భర్తలు ఆఫీసుకు వెళ్ళిపోయాక పనులన్నీ చక్కబెట్టుకుని మధ్యాహ్నం తర్వాత ఇద్దరు చాలా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటారు.

నళిని భర్త సురేష్ ఆఫీసునుండో, క్యాంపు నుండో ఇంటికొస్తూ మల్లెపూలు తీసుకుని వస్తాడు.

సంవత్సరానికి ఒకసారి చీరో, నగో తెచ్చి ఆశ్చర్యంలో ముంచేస్తుంటాడు. కానీ ప్రణవి భర్త వేణు మాత్రం ఎప్పుడోగానీ మల్లెపూలు తీసుకుని రాడు.

ఏదైనా సందర్భం వుంటే తప్ప, కనీసం ఒక చీర కొనాలనే ధ్యాసే వుండదు. నళినీని ఆమె భర్త ప్రేమించినంతగా, తనని తన భర్త ప్రేమించడం లేదన్న బాధ ప్రణవికి వుంది.

ఓసారి మాటల సందర్భంలో "నళినీని ఆమె భర్త ప్రేమగా చూసుకున్నంతగా మీరు నన్ను చూసుకోవడం లేదు" అని అంది.

"చూడు ప్రణూ! నాకు నీమీద ప్రేమ వుందని రోజూ మల్లెపూలు తెచ్చి రుజువు చేసుకోలేను. చీరలో, నగలో నీకు తేనంత మాత్రాన నీమీద నాకు ప్రేమ లేనట్టు ఊహించుకోవద్దు. పరాయి వాళ్ళని చూసి నేను ప్రేమ నటించలేను...మన పెళ్లైన తొమ్మిదేళ్ళల్లో నేను నిన్ను ఎలా చూసుకున్నానో గుర్తుతెచ్చుకో. అంతేకానీ ఎవరితోనో పోల్చుకుని నువ్వు బాధపడి, నన్ను బాధపెట్టొద్దు" అని లెక్చర్ దంచాడు వేణు.

అయినాసరే ప్రేమించే భర్త వున్నందుకు నళినీ అదృష్టాన్ని తల్చుకుని ప్రణవి బాధపడ్డం మానలేదు.

***

ఓరోజు ప్రొద్దున్నే హడావుడిగా నళిని బయటకు వెళ్ళడం చూసింది ప్రణవి. విషయమేంటో వాళ్ల పనిమనిషి వచ్చాక తెల్సింది.

నళినీ భర్తకు ఎవరో ఆవిడతో ఎఫైర్ వుందట. అది తెల్సుకుని ఆమె బంధువులు నళినీ భర్తను చావకొట్టారుట. హాస్పిటల్లో వున్న భర్తను చూట్టానికి వెళ్ళింది నళిని.

"చూట్టానికి అలా వుంటాడుగానీ వట్టి పాడు మనిషమ్మా. ఓసారి నా చెయ్యి పట్టుకున్నాడు. ఈ విషయం చెబితే నళినమ్మా నన్ను పన్లో నుండి మాన్పించేస్తారని ఊరకుండిపోయాను" అని నళినీ భర్త గురించి చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది పనిమనిషి.

తప్పుడు పనులు చేస్తూ ఆ అపరాధ భావం నుంచి తప్పించుకోడానికి నళినీ మీద లేని ప్రేమ నటించేవాడని ఇప్పుడు ప్రణవి అర్థం చేసుకుంది.

తన భర్త అలాంటివాడు కానందుకు ఎంతో సంతోషంగా ఫీలైంది.

***

ఓరోజు సాయంత్రం ఆఫీసునుండి వస్తూ ప్రణవికి మల్లెపూలు తీసుకుని వచ్చాడు వేణు.

"ఎందుకండీ ఇవి! మల్లెపూలు తేనంత మాత్రాన నామీద మీకు ప్రేమలేకుండా పోతుందా?!" అని కాఫీ ఇచ్చి కిచెన్‌లోకి వెళ్ళిపోయింది ప్రణవి.

ఆశ్చర్యంతో కాఫీ కప్పువంకా, ప్రణవివైపూ మార్చి మార్చి చూశాడు వేణు.

★